క్లుప్తంగా

ఘనంగా మోదమ్మ అంబలం పూజ



కె.జె.పురంలో మోదమ్మ అంబలం పూజలో పాల్గొన్న మాలాధారణ భక్తులు

మాడుగుల రూరల్: మండలంలోని కె.జె.పురంలో మంగళవారం రాత్రి మోదమ్మ అంబలం పూజను ఘనంగా నిర్వహించారు. స్థానిక మోదమాంబ మాలాధారణ భక్తుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భజన చేశారు. ఈ కార్యక్రమంలో గురుమాత పాలకుర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

హడలెత్తిస్తున్న గ్రామ సింహాలు



గొలుగొండలోని ఓ వీధిలో తిరుగుతున్న కుక్కలు

గొలుగొండ: మండలంలోని పలు గ్రామాల్లో వీధి కుక్కలు హడలెత్తిస్తున్నాయి. ఏఎల్ పురం ,గొలుగొండ, జోగుంపేట, చీడిగుమ్మలలో వీటి సమస్య అధికంగా ఉంది. వీధుల్లో తిరుగుతూ కనిపించిన వారిపై దాడి చేసి, కరుస్తున్నాయని ఆయా గ్రామస్తులు తెలిపారు. గ్రామాలకు దూరంగా ఉన్న పశువుల పాకల వద్ద లేగదూడలపై దాడి చేసి, చంపుతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. పంచాయతీ అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరారు.

వృథాగా ఏలేరు నీరు



అక్విడెక్ట్ నుంచి లీకవుతున్న నీరు

మాకవరపాలెం: మండలంలోని లచ్చన్నపాలెం వద్ద సర్పానదిపై ఉన్న అక్విడెక్ట్‌కు రంధ్రాలు పడడంతో ఏలేరు నీరు లీకై నదిలోకి వృథాగా పోతోంది. గతంలో ఈ అక్విడెక్ట్‌కు మరమ్మతులు చేసినా ఫలితం లేకపోయింది. నీరు వృథాగా పోతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఈ అక్విడెక్ట్‌కు మరమ్మతులు చేపట్టి నీటి వృథాకు అడ్డుకట్ట వేయాలని ఈ ప్రాంతీయులు కోరారు.

కేజే పురంలో టీడీపీ సంబరాలు



కేజే పురంలో కేక్ కట్ చేస్తున్న టీడీపీ శ్రేణులు

మాడుగుల రూరల్: రాష్ట్రంలో కూటమి ఆధ్వర్యంలో ప్రభుత్వం ఏర్పడడంతో పాటు సీఎంగా చంద్రబాబునాయుడు, మంత్రులుగా పలువురు ప్రమాణ స్వీకారం చేయడంతో కేజే పురంలో టీడీపీ నేతలు బుధవారం సంబరాలు జరుపుకొన్నారు. నియోజకవర్గ మహిళా విభాగం అధ్యక్షురాలు కర్రి నాగమణి ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ప్రభుత్వ పాఠశాలలు పునఃప్రారంభం

మాడుగుల రూరల్ : మండలంలోని 69 ప్రభుత్వ పాఠశాలలు, కస్తూర్బా బాలికల పాఠశాల, రెండు గిరిజన సంక్షేమ ఆశ్రమోన్నత పాఠశాలలు గురువారం తెరచుకోనున్నాయి. వేసవి సెలవుల అనంతరం ఈ నెల 12న బడులు తెరచుకోవాల్సి ఉండగా, ఒక రోజు సెలవును పొడిగించారు. విద్యార్థులకు పంపిణీ చేసేందుకు పాఠ్య, నోట్‌పుస్తకాలు, యూనిఫారమ్స్‌ను మండల విద్యాశాఖ కార్యాలయంలో సిద్ధం చేశారు. పాఠశాలలు ప్రారంభమైన వెంటనే వీటిని పంపిణీ చేస్తామని ఎంఈవోలు దేముడమ్మ, పాండురంగారావు తెలిపారు.

అయ్యన్న వర్గీయులకు షాక్

- మంత్రివర్గంలో దక్కని చోటు
- కంగుతిన్న అనుయాయులు
- పట్టణంలో కానరాని టీడీపీ శ్రేణుల సందడి



నర్సీపట్నం: రాష్ట్ర మంత్రి వర్గంలో సీనియర్ నాయుడు చింతకాయల అయ్యన్నపాత్రుడుకు చోటు దక్కకపోవడంతో ఆయన వర్గీయుల్లో తీవ్ర నిరాశ నెలకొంది. అయ్యన్నపాత్రుడుకు మంత్రి వర్గంలో చోటు దాదాపు ఖాయమనే నమ్మకంతో పార్టీ శ్రేణులు నియోజకవర్గ వ్యాప్తంగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ నెల 12 మంత్రిగా ప్రమాణ స్వీకారం చేయబోతున్న అయ్యన్నకు శుభాకాంక్షలు అంటూ పెద్ద ఎత్తున్న కటౌట్లు ఏర్పాటు చేసి, అభిమానాన్ని చాటుకున్నారు. నియోజకవర్గ కేంద్రమైన నర్సీపట్నంలోనూ, మండల కేంద్రాల్లో పెద్ద ఎత్తున కటౌట్లు వెలిసాయి. అయితే మంత్రివర్గ జాబితాలో అయ్యన్నపాత్రుడు పేరు లేకపోవడంతో నియోజకవర్గంలో టీడీపీ నాయకులు కంగుతిన్నారు.అసలు ఏమి జరిగిందో అర్థం కాక నాయకులు అయోమయంలో పడ్డారు. పార్టీ అధికారంలో లేనప్పుడు రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీని బలోపేతం చేసిన అయ్యన్నపాత్రుడికి మంత్రివర్గంలో చోటు కల్పించకపోవడంపై పార్టీ నాయకులు మథన పడుతున్నారు. అయ్యన్నపాత్రుడు 10 సార్లు పోటీ చేశారు.ఏడు సార్లు విజయం సాధించారు. గతంలో టీడీపీ అధికారంలోకి వచ్చినప్పుడల్లా అయ్యన్నపాత్రుడుకు మంత్రి పదవి లభించింది. ఉమ్మడి జిల్లాల పర్యటనకు వచ్చిన ప్రతి సందర్భంలో ఈ దఫా ఎన్నికల్లో అయ్యన్నపాత్రుడు విజయం సాధిస్తే మంత్రిగా చేస్తామని స్వయంగా నారా లోకేష్ ప్రకటించారు. దీంతో అయ్యన్నపాత్రుడు మంత్రి అవుతారనే నమ్మకంతో టీడీపీ క్యాడర్ అంతా ఎంతో ఉత్సాహంతో ఉన్న నేపథ్యంలో అనకాపల్లి జిల్లాలో వంగలపూడి అనితకు మాత్రమే మంత్రిగా అవకాశం రావడంతో అయ్యన్న వర్గీయులు జీర్ణించుకోలేకపోతున్నారు.

విత్తనాల కోసం చురుగ్గా రిజిస్ట్రేషన్లు

నాతవరం: ఖరీఫ్ సీజన్‌లో రైతులకు వరి విత్తనాలు పంపిణీ చేసేందుకు రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చురుగ్గా జరుగుతోందని వ్యవసాయాధికారి శైలజ బుధవారం తెలిపారు. జిల్లాలోనే అధిక విస్తీర్ణంలో నాతవరం మండలంలో ఖరీఫ్‌లో వరిసాగు చేస్తున్నట్టు చెప్పారు. తాండవరిజర్వాయర్ నీరు అందుబాటులో ఉండడం వల్ల కొన్నాళ్లుగా అధిక విస్తీర్ణంలో వరి సాగుతోందని తెలిపారు. ఈఏడాది రైతులకు అవసరమైన 1,798 క్వింటాళ్ల వరి విత్తనాలు పంపిణీ చేసేందుకు ప్రతిపాదన పంపినట్టు చెప్పారు. విత్తనాలు కావలసిన రైతులు ముందుగా ఆన్‌లైన్‌లో ఆర్బీకేలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తెలిపారు.

వరి విత్తనాల ధరల వివరాలు (30కిలోలు)

విత్తన రకం	ధర(రూ.లలో)
ఆర్‌జీఎల్ శ్రీకాకుళం సన్నాలు (2537)	955
1064 (యంటీయూ)	895
1061(యంటీయూ)	895
1121 (యంటీయూ)	895
1124(యంటీయూ)	895
1318 (యంటీయూ)	895
5204 (బీపీటీ)సాంబమసూరి 25కేజీలు	795



విత్తనాల కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

రిజిస్ట్రేషన్ తప్పనిసరి

మాకవరపాలెం: వరి విత్తనాలు పొందేందుకు రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏవో చిరంజీవి తెలిపారు. రాయితీపై 1061, 1064, సోనా మసూరి, సాంబ మసూరి, తెలంగాణ సాంబ, ఆర్‌జీఎల్ – 2537, ఎంటీయూ 1318 రకాల విత్తనాలు అందజేయనున్నట్టు చెప్పారు. మండలంలోని 15 రైతు భరోసా కేంద్రాల పరిధిలో ఉన్న రైతులకు 850 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. విత్తనాలు కావలసిన రైతులు వెంటనే రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు.

విద్యార్థులకు స్కూల్ బ్యాగ్‌ల పంపిణీ

నర్సీపట్నం: వచ్చే ఏడాది టెన్త్ పరీక్షల్లో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను ఉచితంగా విమానంలో హైదరాబాద్ తీసుకువెళ్తామని, అక్కడ రామోజీ ఫిల్మ్ సిటీ చూపిస్తామని ప్రముఖ ఈఎన్‌టీ వైద్యులు సంతోష్ తెలిపారు. మన్కైండ్ ఫార్మసీ కంపెనీ సౌజన్యంతో ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాల విద్యార్థులకు స్కూల్‌బ్యాగ్‌లు, లంచ్ బాక్సులు, వాటర్ బాటిళ్లు, స్టేషనరీ సామగ్రిని ఆయన సమకూర్చారు. వీటిని ప్రిన్సిపాల్ ఎస్. వెంకటరెడ్డి చేతుల మీదగా విద్యార్థులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ కష్టపడి చదివితే లక్ష్యాన్ని సాధించవచ్చని చెప్పారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యాభివృద్ధిలో భాగస్వామ్యవుతున్న మన్కైండ్ ఫార్మా కంపెనీ యాజమాన్యానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు నగేష్, సురేష్, స్కూల్ కమిటీ చైర్మన్ బాబ్జి, ఉపాధ్యాయులు రజని, శ్రీదేవి, సత్తిబాబు, పద్మావతి, లక్ష్మి, ప్రసన్న, శ్రీరామ్, శివ తదితరులు పాల్గొన్నారు.



బ్యాగ్‌లు పొందిన విద్యార్థులతో డాక్టర్ సంతోష్, ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి

శ్రీకృష్ణ విగ్రహ ప్రతిష్టాపనోత్సవం రేపు



కొండపాలెంలో కృష్ణ మందిరం

రోలుగుంట: కొండపాలెంలోని కృష్ణ మందిరంలో ఈ నెల 14 విగ్రహ ప్రతిష్టాపనోత్సవం నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఘనంగా ఏర్పాట్లు చేస్తోంది. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన యాదవ సంఘం ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలు, అన్న సమారాధన నిర్వహించనున్నారు.

81 మందికి నేత్ర వైద్య పరీక్షలు

రోలుగుంట: స్థానిక ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం ఆవరణలో బుధవారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరంలో 81 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో విశాఖ శంకర్ ఫౌండేషన్ సౌజన్యంతో నిర్వహించిన ఈ శిబిరాన్ని పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి మడ్డు తాతబాబు ప్రారంభించారు. 38 మందికి శస్త్ర చికిత్సలు అవసరమని వైద్యులు గుర్తించారు. ఆపరేషన్లు చేసేందుకు వారిని విశాఖ తరలించనున్నట్టు క్యాంపు మేనేజర్ ఎం.అరుణ్ కుమార్ తెలిపారు. శిబిరం నిర్వహణకు సీఈవో మడ్డు మహేష్, గణేష్, చలపతి ఏర్పాట్లు చేశారు.



పరీక్షిస్తున్న డాక్టర్ రమేష్

ఉపాధ్యాయుడి మృతికి సంతాపం



ఈశ్వరరావు(ఫైల్)

చోడవరం రూరల్: పెందుర్తి మండలం పులగానివాని పాలెం మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న కాట్రపల్లి ఈశ్వరరావు మంగళవారం గుండెపోటుతో మృతి చెందారు. చోడవరం మండలం జన్నవరం గ్రామానికి ఈశ్వరరావు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆయన మృతి పట్ల పలువురు ఉపాధ్యాయులు సంతాపం వ్యక్తం చేశారు.

రెండు రోజుల్లో విద్యార్థులకు కిట్‌ల పంపిణీ

- డీఈవో వెంకటలక్ష్మమ్మ ఆదేశం



విద్యార్థి కిట్లను పరిశీలిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

మునగపాక : మునగపాక ఎంఆర్‌సీ భవనం నుంచి పాఠశాలలకు పంపిణీ చేస్తున్న విద్యార్థి కిట్లను బుధవారం డీఈవో పి.వెంకటలక్ష్మమ్మ పరిశీలించారు. విద్యార్థులకు అందించనున్న కిట్‌ల నాణ్యతను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రెండు రోజుల్లోగా విద్యార్థులకు కిట్లను అందజేయాలని ఆదేశించారు. పంపిణీలో జాప్యం లేకుండా చూడాలని ఎంఈవో 1,2లు వేణు గోపాలరావు, శివనాయుడులను కోరారు. ఆమె వెంట సీఆర్పీలు కర్రి లక్ష్మీనారాయణ,బి.అచ్యుతకృష్ణ, ఎం.గోవింద,సత్తిబాబు,నూకేష్ పాల్గొన్నారు.

ఘనంగా గణపతి ఆలయ వార్షికోత్సవం



ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

నక్కపల్లి : మండల కేంద్రం నక్కపల్లి వెంకటనగర్ కాలనీలో ఉన్న సంపత్ వినాయక ఆలయ వార్షికోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి స్వామివారికి హోమాలు, పూర్ణాహుతి, నీరాజన మంత్రపుష్పాలు నిర్వహించారు. భక్తుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నక్కపల్లి, కొత్తపేట, రాజీవ్‌నగర్‌కాలనీ, బండారు పేట, అప్పలపాయకరావుపేట తదితర ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలి వచ్చిన స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అన్న సమారాధన ఏర్పాటు చేశారు.

దేవస్థానం చైర్మన్ పదవికి రాజీనామా

అనకాపల్లి:స్థానిక సుంకరమెట్ట సూర్యనారాయణ, సత్యనారాయణ స్వామి దేవస్థానం చైర్మన్ పదవికి కేఎం నాయుడు బుధవారం రాజీనామా చేశారు. ఈ మేరకు ఆలయ ఈవో కీర్తి ఆదినారాయణకు రాజీనామా పత్రాన్ని అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో ప్రజల తీర్పును అంగీకరిస్తూ తన పదవికి రాజీనామా చేసినట్లు పేర్కొన్నారు. భక్తునిగా ఆలయ అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషిచేస్తానన్నారు. ఆలయ సిబ్బందికి వస్త్రాలు, మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ డైరెక్టర్లు పెంటకోట అప్పలనాయుడు, విజ్జపు వాసుముకుంద, మారిశెట్టి శ్రీను, తాడి నాగలక్ష్మి, తగరంపూడి నర్సింగరావు, ఎక్స్ ఆఫీషియో సభ్యుడు మవ్వుడూరి విద్యాసాగర్ పాల్గొన్నారు.



ఈవో కీర్తి ఆదినారాయణకు రాజీనామా పత్రాన్ని అందిస్తున్న కేఎం నాయుడు

ఘనంగా నల్లకొండమ్మ ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక అలంకరణతో అమ్మవారు



ఆలయ ప్రాంగణంలో హోమం

నాతవరం: కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లి శ్రీనల్లకొండమ్మ తల్లి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. నాతవరంలో పూర్వం నుంచి గ్రామస్తులు శ్రీనల్లకొండమ్మ తల్లిని గ్రామ దేవతగా ఆరాధిస్తున్నారు. ఆలయం లేకపోవడంతో చెట్టు వద్ద అమ్మవారిని పూజించేవారు. దేవాలయాలను నిర్మించేందుకు గత ప్రభుత్వం ప్రోత్సహించింది. దీంతో నాతవరంలో శ్రీనల్లకొండమ్మ తల్లి ఆలయ నిర్మాణం కోసం అప్పటి ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ నిధులు మంజూరు చేశారు. ఈనిధులతో స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు సంయుక్తంగా అమ్మవారిని ఆలయాన్ని సర్వాంగసుందరంగా నిర్మించారు. గత ఏడాది జూన్ 12న ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్, మంత్రులు, కలెక్టరు ఆలయాన్ని ప్రారంభించారు. ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు, హోమాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఆలయ ప్రాంగణంలో సందడి నెలకొంది. మధ్యాహ్నం అన్నసమారాధన, కోలాటం, భజన కార్యక్రమాలతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఎరువులు, విత్తన దుకాణాల్లో తనిఖీలు

దేవరాపల్లి: వరి విత్తనాలను అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ అధికారి వై.కాంతమ్మ హెచ్చరించారు. స్థానిక లైసెన్స్ ఎరువులు, విత్తనాల దుకాణాల్లో బుధవారం ఆమె ఆకస్మికంగా తనిఖీలు చేశారు. దుకాణాల వద్ద విత్తనాల ధరల పట్టికలను ఏర్పాటు చేయాలని, విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు రసీదు తప్పనిసరిగా ఇవ్వాలని దుకాణాల యజమానులకు ఏవో సూచించారు. విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు 100 గింజలు తీసుకుని ముందుగా మొలక శాతం కట్టాలని ఆమె తెలిపారు. ఈ సందర్భంగా తనిఖీ చేసిన దుకాణాల్లో విత్తన బస్తాల నుంచి శాంపిల్స్ సేకరించారు. ఈ శాంపిల్ విత్తనాలను క్వాలిటీ కంట్రోల్ ల్యాబ్‌కు పంపిస్తామని ఆమె చెప్పారు. ఎక్కడైనా అధిక ధరలకు విత్తనాలు విక్రయించినా, విత్తనాల నాణ్యత లోపించినా తమకు పిర్యాదు చేయాలని కోరారు. ఆమె వెంట మండల వ్యవసాయ విస్తర్ణ అధికారి ఎస్.కిరణ్ కుమార్ తదితరులున్నారు.



గ్రోమోర్ షాపులో రికార్డులను పరిశీలిస్తున్న ఏవో కాంతమ్మ

బాల కార్మిక వ్యవస్థను నిర్మూలిస్తేనే అభివృద్ధి

చోడవరం రూరల్: బాల కార్మిక వ్యవస్థను రూపుమాపితేనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని స్థానిక ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి జి.స్వర్ణ తెలిపారు. బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కోర్టు ప్రాంగణంలో బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో ఆమె మాట్లాడుతూ హోటళ్లు, వ్యాపార సంస్థలు, చిన్నపాటి పరిశ్రమలు, కర్మాగారాలలో పిల్లలతో పనులు చేయించడం చట్టరీత్యా తీవ్ర నేరమన్న సంగతి ప్రతి ఒక్కరూ గుర్తెరగాలన్నారు. ఎవరైనా బాలలతో పనులు చేయిస్తున్నట్టయితే వారికి ఈ విషయం తెలియపరచి, పనుల్లో ఉన్న పిల్లలకు విముక్తి లభించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు.ఈ దిశగా ప్రతి ఒక్కరూ కృషి చేస్తే బాల కార్మిక వ్యవస్థను రూపుమాపగలమన్నారు. సహాయ కార్మిక అధికారి పి.సూర్యనారాయణ, వెనుకబడిన తరగతుల సంక్షేమ గృహం వార్డెన్ జె.నారాయణ రావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి స్వర్ణ

శారీరక దృఢత్వంతో మానసిక ఆరోగ్యం

చోడవరం రూరల్: ప్రతి విద్యార్థి శారీరకంగా దృఢత్వాన్ని కలిగి ఉన్నట్టయితే మానసికంగానూ ఆరోగ్యంగా ఉండి ఎటువంటి ఒత్తిడులకు లోను కాకుండా ఉండగలరని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాధాకృష్ణ అన్నారు. కళాశాలలోని సెమినార్ హాల్‌లో జాతీయ సేవా పథకం మూడు యూనిట్లు, ఆదిత్య బిర్లా ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఎం పవర్ ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులకు చక్కని అవకాశం కల్పించిన ఆదిత్య బిర్లా ఇనిస్టిట్యూట్ ప్రతినిధులు సుధాకర్, రిసోర్స్ పర్సన్ సాయివంశీ బృందానికి ధన్యవాదాలు తెలిపారు. ప్రతి విద్యార్థి మానసిక సామర్థ్యాన్ని పెంచుకోవాలన్నారు. మానసిక ఒత్తిడులు తగ్గించుకోవడానికి ఇటువంటి కార్యక్రమాలు దోహదపడతాయన్నారు. ఆదిత్య టీం కోఆర్డినేటర్ సుధాకర్ మాట్లాడుతూ విద్యార్థులకు తమ ఎం పవర్ కార్యక్రమం ఎంతగానో ఉపకరిస్తుందన్నారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ రత్నభారతి మాట్లాడుతూ విద్యార్థుల మానసిక ఒత్తిడులను తగ్గించడానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవోలు బి.పిచ్చమ్మ, డి.మాల్యాద్రి, సీనియర్ అధ్యాపకులు ఎస్ఎం రఫీయుద్దీన్, సీహెచ్.సుధీర్, వి.అప్పలనాయుడు, సీహెచ్. జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రాధాకృష్ణ

గ్రామీణ గ్రంథాలయాలకు మహర్దశ

- రూ.13.90 లక్షలతో మరమ్మతులు
- గత ప్రభుత్వంలోనే నిధుల విడుదల
- పూర్తికావచ్చిన పనులు
- పరిశీలించిన అధికారులు



మరమ్మతు పనులు పూర్తయిన ఉపమాక శాఖాగ్రంథాలయం

నక్కపల్లి : మండలంలో రెండు గ్రామీణ గ్రంథాలయాలకు మహర్దశ పట్టింది. ఉపమాక, చినదొడ్డిగల్లు గ్రామాల్లో విజ్ఞాన భాండాగారాలుగా విరాజిల్లుతున్న ఈ పుస్తక పఠనాలయాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ ఈ శిథిల భవనాల్లోనే విధులు నిర్వహించే పరిస్థితి నెలకొంది. శాఖాగ్రంథాలయాలనే తప్ప, మారుమూల గ్రామాల్లో ఏర్పాటు చేసిన గ్రామీణ గ్రంథాలయాలను పట్టించుకున్న దాఖలాలు లేవు. పాఠకులంతా మండల కేంద్రాలకు వచ్చే అవసరం లేకుండా పేపర్లు, నవలలు, పోటీపరీక్షలకు హాజరయ్యేందుకు అవసరమైన పుస్తకాలను రివ్యూ చేసుకునేందుకు గతంలో గ్రామీణ గ్రంథాలయాలను ఏర్పాటు చేశారు. నక్కపల్లి మండలంలో ఉన్న ఈ రెండు గ్రంథాలయాలు పూర్తిగా పాడయ్యాయి. రెండు పెద్ద గ్రామాల్లో ఉన్న ఈ గ్రంథాయాలకు పాఠకుల సంఖ్య ఎక్కువగానే ఉంటోంది. రెండు గ్రంథాలయాలకు ఇన్‌చార్జ్‌గా కె.జనార్దన్ వ్యవహరిస్తున్నారు. ఇతని ప్రత్యేక శ్రద్ధతో మండల కేంద్రంలో ఉన్న శాఖాగ్రంథాలయాల కంటే ఎక్కువ ఆదరణ ఈ గ్రామీణ గ్రంథాలయాలకు ఉంది. ఎప్పటికప్పుడు పాఠకులకు అవసరమైన పత్రికలు, పుస్తకాలను సరఫరా చేస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. వేసవి కాలంలో విద్యార్థుల కోసం ప్రత్యేక సమ్మర్ క్యాంపు ఏర్పాటు చేసి స్పోకెన్ ఇంగ్లిషు, వివిధ అంశాలపై వ్యాసరచన, వకృత్వ, క్విజ్‌పోటీలు ఏర్పాటు చేశారు. దాతల సాయంతో విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. గ్రంథాలయాలను ప్రజలకు మరింత చేరువ చేయడం, పాఠకుల సంఖ్య మరింత పెంచాలన్నా, పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలతోపాటు, విజ్ఞానాన్ని, వినోదాన్ని ఆధ్యాత్మికతను పెంచేందుకు అవసరమైన మరిన్ని పుస్తకాలు అవసరం ఉంది. ఇవన్నీ సమకూర్చడానికి అవసరమైన దాతలున్నప్పటికీ వసతి సమస్య వేధిస్తోంది. దీన్ని దృష్టిలో పెట్టుకుని గ్రంథాలయాధికారి జనార్దన్ పలుమార్లు ఈ గ్రంథాలయాలను మరమ్మతులు చేయించాలని గ్రంథాలయశాఖ ఉన్నతాధికారులను వేడుకున్నారు. పట్టువదలని విక్రమార్కునిలా దాదాపు నాలుగేళ్లపాటు ఉత్తర ప్రత్యుత్తరాలు రాయడం, ఇక్కడ వాస్తవ పరిస్థితులను నివేదించడం చేశారు. ఎట్టకేలకు స్పందించిన జిల్లా గ్రంథాలయ శాఖ వారు ఈ రెండు గ్రంథాలయాల మరమ్మతులకు రూ.13.90 లక్షలు విడుదల చేశారు. ఉపమాక గ్రంథాలయానికి రూ.7.20లక్షలు, చినదొడ్డిగల్లు గ్రంథాలయానికి రూ.6.70లక్షలు విడుదల చేయడంతో మరమ్మతు పనులు చేపట్టారు. ఉపమాకలో 90 శాతం పనులు పూర్తయ్యాయని జనార్దన్ తెలిపారు. చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో 50 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. ఈ గ్రంథాలయాల మరమ్మతు పనులను బుధవారం ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖకు చెందిన ఇంజినీరింగ్ మౌలిక సదుపాయాల కల్పన సంస్థ ఈఈ రమేష్, డీఈ ప్రసాద్, ఏఈ దాడి సత్యస్వరూప్, జయశ్రీ తదితరులు పరిశీలించారు. త్వరితగతిన మిగిలిన పనులు పూర్తిచేసి త్వరలోనే వీటిలో కార్యకలాపాలు ప్రారంభిస్తామని అధికారులు తెలిపారు. జగనన్న ప్రభుత్వం హయాంలో నాడు నేడు కింద ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించిన విధంగానే గ్రంథాలయాల మరమ్మతులకు కూడా నిధులు విడుదల చేయడం పట్ల పాఠకులు, పుస్తక ప్రియుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.